## క్లుప్తంగా

### రేపు వైఎస్సార్‌ సీపీ మండల సమావేశం

గుంటూరు రూరల్‌: చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలేనని వైఎస్సార్‌సీపీ రూరల్‌ మండలం అధ్యక్షుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన అబద్దాల హామీలను ప్రజలు నిత్యం గుర్తు చేసుకుంటూనే ఉన్నారన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు జేకేసీ కళాశాల రోడ్డులోని హోటల్‌ వికాస్‌ ఇన్‌లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై రూరల్‌ మండలం, అర్బన్‌ పరిధిలోని 8 డివిజన్‌లకు కలిపి రూరల్‌, అర్బన్‌ మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గం ఇన్‌చార్జ్‌ బలసాని కిరణ్‌కుమార్‌, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### ఏఎన్‌యూ డ్రైనేజీ వ్యవస్థ పరిష్కారానికి చర్యలేవి!

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డ్రైనేజీ వ్యవస్థ శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏఎన్‌యూ ఏఐఎస్‌ఎఫ్‌ అధ్యక్షుడు పాలం నాసరయ్య సోమవారం ఒక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. గతేడాది భారీ వర్షాల కారణంగా యూనివర్సిటీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో లైబ్రరీలోని పుస్తకాలు నీటిలో నాని పాడయ్యాయన్నారు. హాస్టల్‌లోకి నీరు చేరి విద్యార్థుల రాకపోకలకు భంగం కలిగిందని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

### పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



పెదకాకాని: ప్రభుత్వ భూములలో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ డిమాండ్‌ చేశారు. పెదకాకానిలో సోమవారం తహసీల్దార్‌ కృష్ణకాంత్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పెదకాకాని మండల పరిధిలోని సుందరయ్య కాలనీ, స్వర్ణపురి కాలనీ, శ్రీ లక్ష్మీ శివదుర్గ కాలనీ, ఎన్టీఆర్‌ కాలనీ, వడ్డెర కాలనీ, జాహ్నవిస్‌ కాలనీలలో ప్రభుత్వ స్థలాలలో నివాసాలు ఏర్పాటు చేసుకుని 2000 కుటుంబాలు 20 ఏళ్లుగా ఉంటున్నారన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బురదగుంట సాంబయ్య, ఆముదాల నాగేశ్వరరావు, షేక్‌ జానీ, భాష వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

### పుస్తక పఠనంతో జ్ఞానం



ప్రత్తిపాడు: పుస్తక పఠనంతో పరిపూర్ణ జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని విశ్రాంత డీఎస్పీ కటికల రవికుమార్‌ అన్నారు. 'ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ' వారోత్సవాల్లో భాగంగా వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులోని గ్రంధి సుబ్బారావు లక్ష్మీ నరసమ్మ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల, హైస్కూల్‌ ప్లస్‌ కళాశాలలో సోమవారం ల్యాంప్‌ సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం (మేరా యువ భారత్‌) సహకారంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవికుమార్‌ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందన్నారు. ల్యాంప్‌ సంస్థ డైరెక్టర్‌ కొండపల్లి సాల్మన్‌పాల్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లు, ఆలోచనలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్‌ జీఎస్టీ కమిషనర్‌ బి.రాజేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, విజయభాస్కర్‌, ల్యాంప్‌ సంస్థ ప్రతినిధులు కె.వెంకటేశ్వరరావు, షేక్‌ బాజీ, తురకా మంగయ్య, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల డిమాండ్లు పరిష్కరించాలి



తెనాలి టౌన్‌: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక ఐసీడీఎస్‌ కార్యాలయం వద్ద కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్‌ పాల్గొని సీడీపీవో పి.విజయ గారికి వినతి పత్రం అందజేశారు. ఫేస్‌ రికగ్నిషన్‌ రద్దు చేయాలని, పాత పద్ధతిలో లబ్ధిదారులకు ఫీడింగ్‌ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. 2022 లో ఇచ్చిన ఫోన్‌లు సరిగా పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌ జిల్లా అధ్యక్షులు ఏవీయన్‌ కుమారి ప్రాజెక్ట్‌ కమిటీ ప్రెసిడెంట్‌ వి.విజయలక్ష్మీ, షేక్‌ హసీన భేగం, లావణ్య, సునీత, సుజాత, కనక దుర్గ, పావని, నిర్మల, రాధిక, జరినా బేగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్కారు బడి.. ప్రవేశాల్లో వెనుకబడి!

- నిద్రావస్థలో మండల విద్యాశాఖ
- రెగ్యులర్‌ ఎంఈవోలు లేక కొరవడిన పర్యవేక్షణ
- ప్రైవేటు స్కూళ్లపై ఆసక్తి చూపుతున్న తల్లిదండ్రులు



పొన్నూరు ఎంఈవో కార్యాలయం

పొన్నూరు: పొన్నూరు మండల విద్యా శాఖ నిద్రావస్థలో కొట్టుమిట్టాడుతోంది. విద్యా వ్యవస్థను పటిష్టం చేశామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నా.. స్థానికంగా అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎన్నో సంస్కరణలు మొదలు పెడుతున్నా మండల విద్యాశాఖలో మార్పు కనిపించడం లేదు. మండలంలో కొంతకాలంగా వేరే మండలాలకు చెందిన ఎంఈవోలు ఇన్‌చార్జులుగా వ్యవహరించడంతో మండల విద్యా శాఖ పాలన గాడి తప్పింది. దీంతో పాఠశాలల్లో పురోగతి లేని వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. తల్లిదండ్రులను చైతన్య పరిచి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు చేపడుతున్న చర్యలు నామమాత్రంగా సాగుతున్నాయి. దీంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్ని వీడి ప్రైవేటు స్కూళ్లకు వెళుతున్నా అధికారుల్లో చలనం ఉండటం లేదు.

**క్రమేణా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య..**

సర్కారు బడులను అభివృద్ధి చేశామని కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నా వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిన పరిస్థితి నెలకొంది. పొన్నూరు మండలంలో 88 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి విద్యా సంవత్సరంలో 4608 మంది విద్యార్థులు ఉండగా.. ఈ విద్యా సంవత్సరంలో 4,590 మంది విద్యార్థులు ఉన్నారని సమాచారం. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో 2023–24 సంవత్సరంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మొత్తం 6168 మంది ఉన్నట్లు సమాచారం. దీంతో క్రమేణా విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది. ఈ ఏడాది ప్రవేశాల పెంపునకు జూన్‌లో అధికారులు చేపట్టిన చర్యలు కూడా నామమాత్రంగా సాగాయి. అన్ని కార్యక్రమాలను మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపించారనే విమర్శలు ఉన్నాయి.

**లోపించిన పర్యవేక్షణ..**

ఎంఈవోలు ఇద్దరూ పాఠశాలల పనితీరును పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలను జిల్లా విద్యా శాఖాధికారికి అందజేయాల్సి ఉంది. కానీ ఈ అధికారులు వేరే ప్రాంతాల్లో పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహిస్తూ స్థానికంగా ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తుండటంతో పూర్తి స్థాయిలో పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు ఉన్నాయి. విద్యా ప్రమాణాలు తగ్గిపోవడానికి అధికారుల పర్యవేక్షణ లోపం ప్రధాన కారణంగా తెలుస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

### ప్రవేశాలపై 24 వరకు కార్యక్రమాలు



ఈనెల 24వ తేదీ వరకు విద్యార్థుల చేరికకు ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం మండలంలోని పాఠశాలల్లో గత ఏడాది ఉన్న విధంగానే విద్యార్థులు ఉన్నారు. మరో 20 మంది మాత్రమే ప్రస్తుతం తగ్గారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చే విధంగా తల్లిదండ్రులను కోరుతున్నాం. ప్రభుత్వం అందించే సౌకర్యాలు, ప్రయోజనాలను వివరిస్తున్నాం.

విజయ భాస్కర్‌, ఎంఈవో–2, పొన్నూరు

# మోసం చేయడం చంద్రబాబు నైజం

- సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు
- వైఎస్సార్‌ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని, కూటమి ప్రభుత్వ అరాచకాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన మోసపూరిత హామీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైఎస్సార్‌ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పార్టీ శ్రేణులతో అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణ, మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ అధ్యక్షత వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల మేనిఫెస్టో క్యూర్‌ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌ బుక్‌ పాలనతో ప్రజాస్వామ్యం పీక నొక్కుతుందని అన్నారు. సూపర్‌సిక్స్‌ హామీలను ప్రశ్నిస్తుంటే టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని విమర్శించారు.

**ధూళిపాళ్లను మంచి నాయకుడని చెప్పేవారు లేరు..**

పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను నియోజకవర్గంలో మంచి నాయకుడని చెప్పేవారు వెతికినా ఎవరూ కనిపించలేదని అంబటి మురళీకృష్ణ అన్నారు. స్వలాభం కోసం కొంతమంది మాత్రమే ఆయనను అనుసరిస్తున్నారే తప్ప అభిమానంతో ఎవరూ లేరని విమర్శించారు. గత కొంత కాలంగా ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆరోపించారు. భవిష్యత్‌లో నరేంద్రకు టికెట్‌ కూడా ప్రశ్నార్థకమేనని ఆయన అన్నారు. అనంతరం ఇటీవల పదవులు పొందిన నాయకులు అంబటి మురళీకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, వైస్‌ ఎంపీపీ అంబటి రాఘవయ్య, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి యందేటి వెంకట సుబ్బయ్య, యువజన అధ్యక్షులు చుండూరు వీరయ్య, నాయకులు షేక్‌ నాజర్‌, లంకపోతు పిచ్చిరెడ్డి, దుర్గాప్రసాద్‌, అంబటి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు కూచిపూడి మరియారాణి, ఇంటిలెక్చువల్‌ ఫోరం అధ్యక్షులు రవీంద్రబాబు, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# రియల్‌ వెంచర్‌తో పంటపొలాలు మునక



పొలాలలో చేరిన వరద నీరు

ప్రత్తిపాడు: రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారులు వేసిన వెంచర్‌ వల్ల పంట పొలాలు నీట మునిగిపోతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ప్రత్తిపాడు తహసీల్దార్‌ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రైతులు తమ సమస్యను పరిష్కరించాలంటూ అధికారులకు వినతిపత్రం అందించారు. ప్రత్తిపాడు నుంచి పాతమల్లాయపాలెం వెళ్లే దారిలో కొందరు రియల్‌ వ్యాపారులు వెంచర్‌ వేశారని.. ఆ సమయంలో చిన్న చిన్న తూములు ఏర్పాటు చేయడంతో వర్షపు నీరు సక్రమంగా ముందుకు పారక పొలాలను ముంచెత్తుతున్నాయన్నారు. ఇలాంటి ముంపు సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అదేవిధంగా ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో అప్పయ్య చెరువు వద్ద నీళ్లు పోయే తూములు ఉన్నాయని.. అవి ప్రస్తుతం చిన్నగా ఉండటం వల్ల నీటి పారుదల సక్రమంగా లేక, పంట పొలాల్లోనికి వర్షపు నీరు వస్తున్నాయని రైతు గ్రీవెన్స్‌లో అర్జీ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు.

### నరేడ్కో కమిటీ సభ్యులకు మేయర్‌ అభినందనలు

నెహ్రూనగర్‌: పీ–4 కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చిన నరేడ్కో కమిటీకి నగరపాలక సంస్థ నుంచి ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతున్నామని మేయర్‌ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్‌ పులి శ్రీనివాసులు తెలిపారు. పీ–4 కార్యక్రమంపై సోమవారం కమిషనర్‌ చాంబర్‌లో మేయర్‌, కమిషనర్‌, అదనపు కమిషనర్‌, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసులతో నరేడ్కో గుంటూరు కమిటీ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్‌, కమిషనర్లు మాట్లాడుతూ నగరంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కోరిన వెంటనే నరేడ్కో కమిటి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలో కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని దత్తత నిర్ణయం తీసుకుంటామని నరేడ్కో కమిటీ తెలిపినట్లు చెప్పారు.

### మూస కవిత్వానికి మనుగడ తక్కువ

నగరంపాలెం: మూస కవిత్వం ఎక్కువ కాలం మనుగడ సాగించదని ప్రముఖ సాహితీవేత్త భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రతినెలా గుంటూరు జిల్లా రచయితల సంఘం నిర్వహిస్తున్న 'కవిత్వంతో కాసేపు'ను సోమవారం సాయంత్రం పాత గుంటూరు బాలాజీ నగర్‌లోని సంఘ సభ్యులు నానా నివాసంలో నిర్వహించారు. భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి కవులు కొత్తదనంతో రాయడానికి కృషి చేయాలని తెలిపారు. సమకాలీన కవులలో కొంత మంది చక్కని కవిత్వాన్ని రాస్తున్నారని, అయితే మంచి కవిత్వం రాయా లంటే అధ్యయనం బాగా చేయాలని ఆయన సూచించారు. కవులు గాంధీ, నానా, వశిష్ట సోమేపల్లి, విజయలక్ష్మీ, బుర్రి కుమార్‌రాజు, సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌.ఎం.సుభాని స్వీయ కవితలతో పాటు సమకాలిన కవులు రాసిన కవితల్లో నచ్చిన కవితలను చదివారు. చిరుజల్లుల వర్షంలో 'కవిత్వంతో కాసేపు' ఆహ్లాదంగా సాగిందని వారు తెలిపారు.

# ప్రజల్లోకి కూటమి ప్రజా వ్యతిరేక విధానాలు

- పెదనందిపాడులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ
- పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌ కుమార్‌



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బలసాని కిరణ్‌కుమార్‌, పార్టీ నాయకులు

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ బలసాని కిరణ్‌ కుమార్‌ అన్నారు. పెదనందిపాడులో సోమవారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జ్‌ బలసాని కిరణ్‌ కుమార్‌ రీకాలింగ్‌ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్లను ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు షేక్‌ ఖాశిం పీరా అధ్యక్షతన జరిగిన సమావేశంలో బలసాని మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో అవినీతి, రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలు ఎక్కువయ్యాయన్నారు. భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్‌ బుక్‌ రాజ్యాంగాన్ని అవలంబిస్తూ ప్రజాకంటక పాలన సాగిస్తున్నారని బలసాని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతి వార్డులోనూ త్వరలో గడప గడపకూ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాపక్షంగా నిలబడి సాగిస్తున్న ఈ ఉద్యమంలో ప్రతి కార్యకర్త యుద్ధ సైనికునిలా పని చేస్తూ, భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి, ఎంపీపీ, సర్పంచ్‌, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుట్రలో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌

వైఎస్సార్‌ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్‌



పట్నంబజారు: కుట్రలు, కుతంత్రాలు, కక్షపూరిత రాజకీయాల్లో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం అరెస్ట్‌ చేసిందని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు తాడిబోయిన వేణుగోపాల్‌ మండిపడ్డారు. నగరంలోని ఆయన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్‌ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు. నారా వారి సారా పాలన ప్రతి ఒక్కరికీ తెలుసని, వీధికి పది బెల్టు షాపులు, ఊరికి వంద వైన్‌ షాపులు పెట్టించిన ఘనత ఆయనకే దక్కుతుందని విమర్శించారు. ఐదేళ్ల వైఎస్సార్‌ సీపీ పాలనలో ప్రభుత్వమే లిక్కర్‌ పాలసీ విధానాన్ని తీసుకుని మద్యం విక్రయిస్తే.. అసలు అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మద్యం దుకాణాలను ప్రైవేట్‌ పరం చేసి, కూటమి నేతల అక్రమార్జన కోసం అవినీతిని పెంచి పోషించింది చంద్రబాబు కాదా ? అని మండిపడ్డారు. మద్యం స్కాంకు చంద్రబాబు మూలమని, ఉద్దేశపూర్వకంగా వైఎస్సార్‌ సీపీ నేతలను టార్గెట్‌గా చేసుకుని, అక్రమ అరెస్ట్‌ పర్వానికి నాంది పలుకుతున్నారన్నారని దుయ్యబట్టారు. కచ్చితంగా ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

# విజ్ఞాన్‌లో ఇన్నోవేషన్‌.. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ ఎఫ్‌డీపీ



కార్యక్రమానికి హాజరైన అతిథులు, సిబ్బంది, అధ్యాపకులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌ యూనివర్సిటీ, విజ్ఞాన్‌ టీబీఐ ఆధ్వర్యంలో ఏఐసీటీఈ, మినిస్ట్రీ ఆఫ్‌ ఎడ్యుకేషన్స్‌ ఇన్నోవేషన్‌ సెల్‌ల ఆర్థిక సౌజన్యంతో 5 రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రామ్‌ ఆన్‌ 'ఇన్నోవేషన్‌–ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌'ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల అధ్యాపకులు ఇందులో పాల్గొన్నారు. అస్పైర్‌ టీబీఐ సీఈవో డాక్టర్‌ బీఎస్‌ రామక్రిష్ణ మాట్లాడుతూ.. ఇంటర్‌డిసిప్లినరీ లెర్నింగ్‌ ప్రాముఖ్యతను వివరించారు. అశోక ఫెలో, ఇన్నోవేషన్‌ కోచ్‌ డాక్టర్‌ రవి చంద్ర రాజు మాట్లాడుతూ.. సమస్యలపై విద్యార్థుల్లో దృష్టికోణాన్ని పెంపొందించేలా అధ్యాపకులు మారాలని సూచించారు. వైస్‌ చాన్స్‌లర్‌ పి.నాగభూషణ్‌, డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# భారతీయ స్టేట్‌బ్యాంక్‌ 43వ శాఖ ప్రారంభం



శాఖను ప్రారంభిస్తున్న బ్యాంక్‌ అధికారులు

గుంటూరు రూరల్‌: నగర శివారుల్లోని ఇన్నర్‌ రింగ్‌రోడ్డు నందు భారతీయ స్టేట్‌ బ్యాంక్‌ 43వ శాఖని బ్యాంక్‌ జనరల్‌ మేనేజర్‌ శైలేష్‌కుమార్‌, డిప్యూటీ జనరల్‌ మేనేజర్‌ కృష్ణకుమార్‌, ప్రభు, రీజినల్‌ మేనేజర్‌ కిషోర్‌కుమార్‌లతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఖాతాదారులకు ఆర్థిక సంబంధిత అన్ని సేవలను ఒకే చోట అందిస్తున్నట్లు తెలిపారు. బ్రాంచ్‌ మేనేజర్‌ విజయకుమార్‌ మాట్లాడుతూ.. ఖాతాదారులకు అత్యుత్తమ సేవలను త్వరగా అందించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఖాతాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జనరల్‌ మేనేజర్‌ను శాలువాలు కప్పి, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పలువురు చీఫ్‌ మేనేజర్లు, ఇతర బ్రాంచ్‌ మేనేజర్లు బ్రాంచ్‌ మేనేజర్‌కు అభినందనలు తెలిపారు. బ్యాంకు అధికార ఉద్యోగ సంఘ నాయకులు జయకుమార్‌, బషీర్‌ అహ్మద్‌, కోటిరెడ్డి, నరేంద్ర, రంగసాయి, ప్రదీప్‌, వీరాంజనేయులు పాల్గొన్నారు.

# ఎఫ్‌ఆర్‌ఎస్‌ రద్దు చేయాలని వినతి



విజయలక్ష్మికి మెమొరాండం అందిస్తున్న లక్ష్మణరావు, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇంటికి సరుకులు ఇచ్చే సమయంలో ప్రభుత్వం అమల్లోనికి తీసుకువచ్చిన ఎఫ్‌ఆర్‌ఎస్‌ నిబంధనను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్‌ చేశారు. అంగన్‌వాడీల్లో అమలు చేస్తున్న ఫేస్‌ రికగ్నిషన్‌ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్‌–హెల్పర్స్‌ యూనియన్‌, సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఐసీడీఎస్‌ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నిబంధనలను తొలగించి గతంలో మాదిరిగా సంతకాల ద్వారా సరుకులు అందించాలని కోరుతూ సీడీపీవో జి.విజయలక్ష్మికి అంగన్‌వాడీలు మెమొరాండం అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమలత, ఏ.పద్మ, ప్రాజెక్టు నాయకులు నగరాజకుమారి, శ్రీవాసవి, శశికళ, శివ పార్వతి, నవరత్నమణి, విజయ, వి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వీవీఐటీయూలో ప్రొఫెషనల్‌ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రామ్‌



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్‌ రామకృష్ణ

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్‌ టెక్నోలాజికల్‌ యూనివర్సిటీ సీమన్స్‌ సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ నందు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలల మెకానికల్‌ అధ్యాపకులకు కంప్యూటర్‌ న్యూమరికల్‌ కంట్రోల్‌ ప్రోగ్రామింగ్‌పై ప్రొఫెషనల్‌ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రామ్‌ నిర్వహించారు. మండలంలోని వీవీఐటీయూలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ, సాంకేతిక విద్యా, శిక్షణామండలి, నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఫర్‌ టెక్నికల్‌ టీచర్స్‌ ట్రైనింగ్‌ అండ్‌ రీసెర్చ్‌, చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సాంకేతిక విద్యాశాఖ జాయింట్‌ డైరెక్టర్‌ వి.పద్మారావు, డిప్యుటీ డైరెక్టర్‌(ట్రైనింగ్‌ అండ్‌ ప్లేస్‌మెంట్‌) డాక్టర్‌ ఎంఏవీ రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లడుతూ.. అధ్యాపకులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనను అందిచగలుగుతారన్నారు. నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఫర్‌ టెక్నికల్‌ టీచర్స్‌ ట్రైనింగ్‌ అండ్‌ రీసెర్చ్‌, చెన్నైకు చెందిన అధ్యాపకులు డాక్టర్‌ వినోద్‌ కుమార్‌ ఆధ్వర్యంలో జులై 21 నుంచి 25 వరకూ ఈ శిక్షణను నిర్వహించనున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీవీఐటీయూ సీమన్స్‌ సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రావెల నవీన్‌, సాంకేతిక విద్యాశాఖ వోఎస్‌ సుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



జలమయమైన గుంటూరు–పర్చూరు మెయిన్‌ రోడ్డు



వర్షపు నీటిలో ప్రత్తిపాడు తహసీల్దార్‌ కార్యాలయం

# ఉప్పొంగిన వాగులు.. స్తంభించిన రాకపోకలు

ప్రత్తిపాడు: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. తాజాగా సోమవారం సాయంత్రం నుంచి కురుస్తున్న భారీ వర్షంతో ప్రత్తిపాడులోని గుంటూరు–పర్చూరు పాతమద్రాసు రోడ్డు జలమయమయ్యింది. బస్టాండు సహా లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. పంట పొలాలు నీటనానుతున్నాయి. భారీ వర్షాల దెబ్బకు మండలంలోని పలు వాగులు, లోలెవల్‌ చప్టాలు ఉప్పొంగాయి. ప్రత్తిపాడు–గొట్టిపాడు మధ్యనున్న లోలెవల్‌ చప్టాపై ఉన్న నక్కలవాగు ఉప్పొంగడంతో గుంటూరు జిల్లా పరిధిలోని ప్రత్తిపాడు, గొట్టిపాడు, గనికపూడి, కొప్పర్రు, అన్నపర్రు గ్రామాలకు, పల్నాడు జిల్లా పరిధిలోని బోయపాలెం, యడ్లపాడు, ఉన్నవ, చిలకలూరిపేట గ్రామాలకు మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. పలు చోట్ల పెద్ద ఎత్తున ట్రాఫిక్‌ స్తంభించిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రత్తిపాడులోని తహసీల్దార్‌ కార్యాలయం, అంగన్‌వాడీ సెంటరుతో పాటు మెయిన్‌ రోడ్డు నీట మునిగింది.

**చేబ్రోలులో భారీ వర్షం..**

చేబ్రోలు: చేబ్రోలు మండల పరిధిలోని ప్రజలు సోమవారం కురిసిన భారీ వర్షంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంతో మాగాణి, మెట్ట, కూరగాయ రైతులకు నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెద పద్ధతిలో వరి సాగు చేస్తున్న రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాన్ని చూసి బెంబేలెత్తిపోతున్నారు.

### ప్రజలకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు

నెహ్రూనగర్‌: నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్‌ పులి శ్రీనివాసులు తెలిపారు. వర్షాల వల్ల సమస్యలు ఎదురైతే తెలిపేందుకు నగరపాలక సంస్థలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్‌ రూం 0863–2345103 ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఆయన సోమవారం శ్రీనగర్‌, పీఎస్‌ నగర్‌, బొంగరాలబీడు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాల వల్ల ప్రజలు అవస్థలు పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నగరంలో ఎక్కడా వర్షం నీరు నిలవకుండా మోటార్లతో సిద్ధంగా ఉండాలని ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాకు సమస్య రాకుండా జనరేటర్లను సిద్ధం చేయాలని చెప్పారు. తాగునీటిలో క్లోరిన్‌, ఆలం తగిన మోతాదులో ఉండేలా శ్యాంపిల్స్‌ను సేకరించాలని సూచించారు. డ్రెయిన్లలో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించడానికి కార్మికులను నియమించుకోవాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని, పురాతన భవనాల్లో నివసించే వారికి నోటీసులు ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులకు ఆయన చెప్పారు.